సాక్షి
వనపర్తి

శనివారం । 8 । జూలై । 2023



పర్యవేక్షణ ఏది..?

ఉమ్మడి జిల్లాలో ఆహార కల్తీ నియంత్రణ అధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

వివరాలు 8లో ▸



పాలమూరు విజయం

హెచ్‌సీఏ బీ–డివిజన్ టుడే లీగ్ మ్యాచ్‌లో పాలమూరు జట్టు విజయం సాధించింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /23.1

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.



ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

హాహాకారాలు.. ఆర్తనాదాలు

- కేజీబీవీలో విద్యార్థినుల అస్వస్థతతో ఉలిక్కిపాటు
- తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- నాణ్యతలేని కూరగాయలు, భోజనాలతో వడ్డిస్తున్నారని ఆవేదన
- పాఠశాలలపై కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

అర్ధరాత్రి నిద్రిస్తున్న విద్యార్థినులు ఒక్కసారిగా కడుపునొప్పితో బాధపడుతూ.. ఆర్తనాదాలు చేస్తూ ఆస్పత్రికి తీసుకెళ్లండని రోదించారు.. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి తమ పరిస్థితి గురించి అక్కడే ఉన్న సీఆర్టీలకు విన్నవించినా పట్టించుకోకుండా తగ్గుతుందిలే అని నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఉదయానికి పరిస్థితి మరింత విషమించడంతో పాటు బాధిత విద్యార్థినులు పెరగడంతో అప్పటికప్పుడు అంబులెన్స్‌లను రప్పించి ఆస్పత్రులకు తరలించారు. ఏకంగా 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడం, ఇందులో 12 మంది పరిస్థితి విషమంగా మారిన సంఘటన అమరచింతలోని కేజీబీవీలో చోటుచేసుకుంది. ఈ విషయం అంతటా వ్యాపించడంతో జిల్లా అధికారులతో పాటు విద్యార్థినుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని.. తమ పిల్లలను ఆస్పత్రులకు, ఇళ్లకు తీసుకెళ్లారు.

అమరచింత/ఆత్మకూర్/వనపర్తి: నిరుపేద, అనాథ పిల్లల కోసం కేజీబీవీలు ఏర్పాటు చేసి మెరుగైన విద్యతోపాటు పౌష్టికత్వంతో కూడిన ఆహారం అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పగా ప్రకటనలు ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడో ఒకచోట భోజనాలు బాగుండటం లేదని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల విద్యార్థులు వెలుగుచూస్తూనే ఉన్నాయి. అయితే తాజాగా అమరచింత మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీలో ఏకంగా 60 మంది విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురవడం అక్కడి పరిస్థితులు తేటతెల్లం చేశాయి. ఇక్కడ మొత్తం 340 మంది విద్యార్థినులు ఉండగా గురువారం 270 మంది విద్యార్థినులు హాజరయ్యారు. వీరికి ప్రతినిత్యం ఆహారం అందించేందుకు సరైన వంట మనుషులు లేకపోవడంతో ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో సరైన భోజనం పెట్టడం లేదని, రుచిగా లేని కూరగాయలు చేస్తున్నారని విద్యార్థినులు వాపోయినా పట్టించుకొనే నాథుడే లేకుండా పోయారు.

పిల్లల ఇళ్ల బాట..

కేజీబీవీలో విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్ అయ్యిందన్న సమాచారంతో తల్లిదండ్రులు పెద్దఎత్తున పాఠశాలకు చేరుకున్నారు. అస్వస్థతకు గురైన వారిలో తమ పిల్లలు ఉన్నారా.. లేదా అన్న వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు తమ పిల్లలను చూసుకునేందుకు ఆస్పత్రులకు వెళ్లగా.. బాగున్న పిల్లలను తల్లిదండ్రులకు ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. కొందరు పిల్లలు మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు ధైర్యం చెప్పడంతో పాఠశాలలోనే ఉండిపోయారు.

బోరు నీరే దిక్కు

పాఠశాలలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రతినిత్యం బోరు నీటినే విద్యార్థినులు వినియోగించుకుంటున్నారు. స్నానాలతోపాటు తాగడానికి, వంట చేయడానికి ఈ నీటినే వాడుతున్నారు. దీంతో నీటి కాలుష్యం జరిగిందా అన్న అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు కేజీబీవీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ అన్నారు. ఆత్మకూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరిశీలించి.. వైద్యసేవలపై అధికారులకు సూచనలు చేశారు. వనపర్తి జనరల్ ఆస్పత్రిలో విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందుతుందని అక్కడ కలెక్టర్ దగ్గరుండి చూసుకుంటున్నారని ఆర్డీఓ పద్మావతి, జీసీడీఓ శుభలక్ష్మి, తహసీల్దార్ సింధూజ తెలిపారు.



విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యుడు

కలెక్టర్ ఆగ్రహం.. ముగ్గురిపై వేటు

జిల్లాలోని అమరచింత కేజీబీవీలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సీరియస్‌గా స్పందించారు. కేజీబీవీ ఎస్‌ఓ స్వప్నరాణిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ, ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు, జీసీడీఓ సుబ్బలక్ష్మికి శుక్రవారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వంట ఏజెన్సీని తక్షణమే మార్చాలని ఆదేశించారు. కొన్ని రోజులుగా సాయంత్రం హాజరు లేకపోవడం పరిశీలనకు వెళ్లిన కలెక్టర్‌కు మద్యం తాగి విధులు నిర్వహిస్తున్నట్లుగా కనిపించిన ఏఎస్ డబ్ల్యూఓ సేవ్యానాయక్‌ను రూరల్ ఎస్‌ఐ నాగన్నతో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి సస్పెండ్ చేశారు. అలాగే కొన్నిరోజులుగా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న కొత్తకోట ఎస్సీ హాస్టల్ వార్డెన్ సంతోష్‌ను సస్పెండ్ చేశారు.

ఒక్క క్షణం ఇక్కడుండొద్దు

- కేజీబీవీ ఎస్‌ఓపై ఎమ్మెల్యే ఆగ్రహం

'ఎంతో ఉన్నత ఆశయాలతో ప్రభుత్వం కేజీబీవీలు ఏర్పాటు చేసింది.. అలాంటి పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్యం క్షీణించే వరకు ఏం చేస్తున్నారు.. వారి ప్రాణాలకు ఏదైనా జరిగితే ఎవరికి నష్టం జరిగేదో ఆలోచించవా అంటూ ఎస్‌ఓ స్వప్నరాణిపై ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు అక్కర్లేదని, వెంటనే ఇక్కడి నుంచి పంపించేయండని జీసీడీఓ శుభలక్ష్మిని ఆదేశించారు. ఆర్డీఓ పద్మావతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, జీసీడీఓతో కలిసి కేజీబీవీని సందర్శించారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, గుడ్లు పొట్టు సైతం ఉండటం ఏమిటని ప్రశ్నించారు. రాత్రివేళలో పాఠశాలలో ఉండాల్సిన ఏఎన్‌ఎం ఎక్కడ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో ఉన్న విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

శాంపిల్స్ సేకరణ..

పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగిందన్న సంఘటనతో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నకిలీ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో వంట పదార్థాల శాంపిల్స్‌ను సేకరించారు. చింతపండులో పురుగులు ఉన్నాయని వీటిని మార్చాలని సూచించారు. మిగిలిన ఆహార, కూరగాయల శాంపిల్స్ తీసుకున్నారు. టమాట కుళ్లినవి కూరలో వినియోగించారా అన్న వివరాలను వంట మనుషులను అడిగి తెలుసుకున్నారు.



ఆత్మకూర్ ఆస్పత్రిలో విద్యార్థిని..

విద్యార్థినులను పరామర్శించిన కలెక్టర్..

వనపర్తి: అస్వస్థతకు గురై చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చిన అమరచింత కస్తూర్బాగాంధీ విద్యార్థినులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ నరేంద్రకుమార్, డీసీహెచ్‌ఎస్ రాజ్‌కుమార్, ఆర్‌ఎంఓ డా. ప్రసాద్‌ను ఆదేశించారు. ఎంత మంది అస్వస్థతకు గురయ్యారు.. జిల్లా ఆస్పత్రికి తరలించిన విద్యార్థులు ఎంత మంది.. కారణాలు ఏమిటనే సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని జీసీడీఓ సుబ్బలక్ష్మిని ఆదేశించారు.

ప్రొటోకాల్‌కే ప్రాధాన్యం..

ఆత్మకూర్ ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం జీజీహెచ్‌కు విద్యార్థినులను తరలిస్తున్న సమయంలో అంబులెన్స్, కలెక్టర్ వాహనాలు ఒకేసారి వచ్చాయి. అక్కడ నిలబడి ఉన్న సూపరింటెండెంట్, డీసీహెచ్‌ఎస్, వైద్యులందరూ కలెక్టర్ వాహనం వద్దకు వెళ్లి స్వాగతం చెప్పడం.. కనీసం ఒక్కరు కూడా అస్వస్థతకు గురైన విద్యార్థులున్న అంబులెన్స్ వద్దకు వెళ్లకపోవడంతో అక్కడున్న వారు విస్మయం వ్యక్తం చేశారు.



జిల్లా జనరల్ ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న కలెక్టర్

కుళ్లిన గుడ్లే కారణమా?

విద్యార్థినులకు కుళ్లిపోయిన కోడిగుడ్లే ఉడక్కబెట్టి ఇచ్చారని, వాటి వల్లే పిల్లలు అస్వస్థతకు గురయ్యారని పలువురు తల్లిదండ్రులు ఆరోపించారు. దీనికి తోడు ఉడకని అన్నంలో పురుగులు పట్టిన కూరగాయలు, టమాటలతో తయారు చేసిన భోజనం చేయడం వల్లే ఇలాంటి పరిస్థితి దాపురించిందని, ఇందుకు కారణమైన ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉడకని అన్నంతో ఇబ్బందులు..



పాఠశాలలో గత కొన్నిరోజుల నుంచి ఉడకని అన్నం తినడంతో ఇబ్బందులు పడుతున్నాం. వీటి గురించి వంట మనుషులకు తెలిపిన ప్రయోజనం లేదు. పాఠశాలలో సుమారు 270మందికి పైగా విద్యార్థినులకు ఒకేసారి వండటంతో వంట మనుషులు లేక ఇబ్బందులు ఏర్పడుతుంది.

– విద్యార్థిని కల్పన, ఇంటర్ రెండో సంవత్సరం, కేజీబీవీ

పాలు ఇవ్వడం లేదు...



పాఠశాలలో చదువుకుంటున్న వారికి సరైన మోతాదులో పాలు ఇవ్వడం లేదు. రోజువారీగా అందించడం లేదు. ఇదేమిటని ప్రశ్నించిన సమాధానం చెప్పడంలేదు. స్నాక్స్ వ్యవహారంలో ఇలాంటి పరిస్థితులే ఉంది.

– పల్లవి, ఇంటర్ రెండో సంవత్సరం, కేజీబీవీ అమరచింత

పరిసరాలు శుభ్రంగా ఉండవు..



పాఠశాలలో తరగతి గదులతో పాటు బాత్‌రూంలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండటం లేదు. వరండాలలో ఎక్కడ పడిన చెత్త అక్కడే అన్నట్లు దర్శనమిచ్చిన వాటిని శుభ్రపర్చడానికి సిబ్బంది లేరని వదిలేస్తున్నారు. దీంతో డస్ట్ అలర్జీలు వస్తుంది.

– అనూష, ఇంటర్ రెండో సంవత్సరం, కేజీబీవీ అమరచింత

తాగునీటి సమస్య ఉంది...



పాఠశాలలో తాగునీటి సమస్య ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథనీరు సైతం రావడం లేదు. గత ఏడాది బాత్‌రూంలకు నీటిని బకెట్‌ల ద్వారా నింపుకుని వెల్లేవాళ్లం. ఇప్పుడు బోరునీరు మాత్రమే అన్ని అవసరాలకు వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది.

– సుమలత, ఇంటర్ మొదటి సంవత్సరం, కేజీబీవీ అమరచింత

న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం చిన్నమందడిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం డీఆర్డీఓ నర్సింహులు, డీపీఓ సురేష్, ఎంపీడీఓ అఫ్జల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రెయినేజీ కాల్వల చివర్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని, వర్షపు నీరు, డ్రెయినేజీ నీరు వృథా కాకుండా భూమిలోకి చేరడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వర్షాకాలంలో గ్రామాల్లోని రోడ్లు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల వారు చిన్నమందడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి అధికారులు సర్పంచ్ సూర్యచంద్రారెడ్డి, పంచాయతీ కార్మికులను అభినందించారు. హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలని అధికారులు సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 49 శాతం ఉత్తీర్ణత

వనపర్తిటౌన్: జూన్‌లో జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విద్యాశాఖ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు విడుదల చేసింది. జిల్లాలో ఫస్ట్, సెకండ్ ఇయర్ జనరల్‌లో 5,531 మంది, ఒకేషనల్‌లో 857 మంది మొత్తం 6,388 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. జనరల్‌లో 2,679 మంది, ఒకేషనల్‌లో 452 మంది మొత్తం 3,131 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు డీఐఈఓ జాకీర్ హుస్సేన్ తెలిపారు. 49 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు.

పదిలో 93.88 శాతం ఉత్తీర్ణత..

శుక్రవారం విడుదలైన 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లాలో 93.88 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు డీఈఓ గోవిందరాజులు పేర్కొన్నారు. బాలురు 751, బాలికలు 539, మొత్తం 1,290 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. బాలురు 699, బాలికలు 512 మొత్తం 1,211 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు.

నేటి నుంచి తాగునీటి సరఫరా నిలిపివేత



వనపర్తిటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో శని, ఆదివారం తాగునీటి సరఫరా ఉండదని ఎంఈ భాస్కర్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రామన్‌పాడు పైపులైన్‌కు దంతనూర్ స్టేజీ, సంకిరెడ్డిపల్లి స్టేజీ, బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం వద్ద మరమ్మతులు చేపడుతున్నందున సవారిగేరి, పాతబజార్, రజకవీధి, నడిమిగేరి తెలుగువాడ, రాయిగడ్డ, కమలానగర్, బ్రహ్మణవీధి, శంకర్‌గంజ్, గణేష్‌నగర్, పీర్లగుట్ట, తిరుమలకాలనీ, బండార్‌నగర్, వల్లభ్‌నగర్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేవంత్‌తో గద్వాల జెడ్పీచైర్‌పర్సన్ భేటీ



గద్వాల క్రైం: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో జోగుళాంబ గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య శుక్రవారం భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని రేవంత్‌రెడ్డి గృహంలో సమావేశమై.. పలు విషయాలు చర్చించినట్లు సమాచారం. త్వరలో కొల్లాపూర్‌లో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగసభలో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. గద్వాల అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీచైర్‌పర్సన్ పోటీలో ఉండేందుకు క్రియాశీలకంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో విభేదాలు, పలు అంతర్గత కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. రేవంత్‌రెడ్డితో భేటీ నేపథ్యంలో జెడ్పీచైర్‌పర్సన్ పార్టీ మార్పు, గద్వాల నుంచి ఎమ్మెల్యే స్థానానికి పోటీకి లైన్ క్లియర్ అయినట్లు సమాచారం.

చట్టాల అమలుతోనే వ్యవస్థకు గుర్తింపు

- ఎస్పీ రక్షిత కె.మూర్తి

వీపనగండ్ల: చట్టాలను అమలు చేయడంలో పోలీసులు ఆదర్శంగా నిలిచినప్పుడే పోలీసు వ్యవస్థకు పేరు ప్రతిష్టలు వస్తాయని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, ఆవరణను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అంకితభావంతో పనిచేసే పోలీసులు ప్రజల్లో గుర్తింపుతో పాటు అధికారుల నుంచి ప్రశంసలు అందుకోవచ్చన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండటం బాధ్యతగా భావించాలని.. స్టేషన్‌లో వర్టికల్స్ నిర్వహణ, ఆన్‌లైన్ వినియోగం, కేసుల నమోదు తదితర వాటిలో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను గౌరవిస్తూ వారిచ్చే వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు గస్తీ నిర్వహించాలని, డయల్ 100 కాల్స్‌పై వెంటనే స్పందించాలని కోరారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి వాహన తనిఖీలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామన్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి

గొర్రెల పంపిణీతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



గొర్రెలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత గొర్రెల పంపిణీతో గొల్ల, కురుమ కుటుంబాల్లో ఆర్థిక భరోసా కల్పించిందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొంకన్‌వానిపల్లిలో రెండోవిడత మంజూరైన ఆరు యూనిట్ల గొర్రె పిల్లలను లబ్ధిదారులకు పంపిణీచేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పథకాలు అమలుచేసి ఆదుకుంటున్నారని వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని.. అప్పుడే గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటన్న, ఎంపీటీసీ సభ్యురాలు శకుంతల, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

విద్యారంగంలో అగ్రభాగాన నిలబెడదాం

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: అంకితభావంతో పనిచేసి జిల్లాను విద్యారంగంలో అగ్రభాగాన నిలబెడదామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ, సెక్టోరియల్ అధికారులు, హాస్టల్ వార్డెన్లు, కేజీబీవీలు, గురుకుల ప్రిన్సిపాల్స్, పీఈటీలు, పీడీలతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. పదోతరగతిలో ఉత్తీర్ణత శాతం ఆశించినస్థాయిలో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా రోజు స్నానం చేసి వస్తున్నారా లేదా.. హోమ్ వర్క్ చేస్తున్నారా.. సమయపాలన పాటిస్తున్నారా అన్న విషయాలను పరిశీలించాలని సూచించారు. ఏవైనా దురలవాట్లకు చేరువవుతుంటే వెంటనే తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడి సన్మార్గంలో నడిచేలా చొరవ తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. హాస్టల్ వార్డెన్లు వారానికి ఒకసారి విద్యార్థుల బ్యాగులు, సామగ్రి ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా ఉత్తమ ఉపాధ్యాయులతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అన్ని పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా చూడాలన్నారు. రోజూ జిల్లాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తనకు తెలియజేసేలా స్పష్టమైన ఆదేశాలివ్వాలని.. తప్పుడు నివేదికలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మధ్యాహ్న భోజనం విషయంలో పరిశుభ్రత, నాణ్యత పాటించాలంటూ అమరచింత ఘటనను గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈఓ గోవిందరాజులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సుశీత, గిరిజన సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి ఫిర్యాదులకు త్వరలోనే పరిష్కారం..

వనపర్తి: ధరణి పోర్టల్‌లోని పెండింగ్ ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ధరణి ఫిర్యాదుల పెండింగ్, జీఓఎంఎస్ నంబర్ 58, 59 ప్రకారం వచ్చిన దరఖాస్తులపై సీసీఎల్‌ఏ ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని జిల్లా వివరాలు వెల్లడించారు. ధరణిలో కొత్తగా ప్రవేశపెట్టిన మాడ్యూల్స్‌తో చాలా సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు ఉందన్నారు. జీఓనంబర్ 58, 59 దరఖాస్తులు జిల్లాలో పెండింగ్‌లో లేవని తెలిపారు. మిస్సింగ్ సర్వేనంబర్ల సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్లకు అధికారం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా వివరాలను సీసీఎల్‌ఏ ప్రధాన కమిషనర్‌కు వివరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

విదేశాలకు పార్సిల్ సర్వీస్‌లు



వనపర్తిటౌన్: పోస్టల్ వ్యవస్థ ఇక నుంచి అంతర్జాతీయస్థాయిలోనూ సేవలు అందించనుందని వనపర్తి ప్రధాన పోస్టల్ సూపరింటెండెంట్ పెద్ద వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పోస్టల్ కార్యాలయం ఎదుట వినియోగదారులకు సర్వీసులపై అవగాహన కల్పించారు. విదేశాల్లో ఉండే బంధువులు, మిత్రులకు పార్సిల్స్‌ను పంపించే అవకాశం ఉందని.. పోస్టల్ వెబ్, కరెంట్ ఖాతా ద్వారా విదేశాలకు పార్సిల్స్ అందించేలా పోస్టాఫీస్‌లో సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జుబేదర్, పోస్ట్‌మాస్టర్ శివ, రేణుక పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి

పాన్‌గల్: రాష్ట్రంలో సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి పాత పింఛన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు కోరుతూ ఈ నెల 16 నుంచి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో టీఎస్‌సీపీఎస్‌ఈయూ రథయాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్ర జోగుళాంబగద్వాల జిల్లాలో ప్రారంభమై అదేరోజు సాయంత్రం వనపర్తి జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. రథయాత్రలో జిల్లాలోని అన్నిశాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బండి శ్రీను, రవి, మల్లేష్, మాధవాచారి, సుంకన్న, శంకర్, కరుణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

వనపర్తి: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న రెండోరోజు ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే వేతనాలు కుటుంబ పోషణకు సరిపోక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, జిల్లా కమిటీ సభ్యుడు ఎన్. రాములు, గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ మండల నాయకులు రాములు, రాజు, రాంచందర్, సతీష్, హన్మంతునాయక్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుట్టా ఆంజనేయులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


మాణిక్యప్ప(ఫైల్)

కోస్గి: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన మణిక్యప్ప గౌడ్(48) తన వ్యవసాయ పొలంలో బోరుమోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. విద్యుత్ వైర్లు తెగి పడిన విషయాన్ని గుర్తించకపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన పక్క పొలం రైతులు విద్యుత్ సరఫరా నిలిపి వేయించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, అతడిని ఓ ప్రైవేట్ వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పంచనామా చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. అతనికి భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



బిజినేపల్లి: ఇంట్లో ఖాళీగా ఉండకుండా ఏదైనా పని చేసుకోవాలని కుటుంబసభ్యులు సూచించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బిజినేపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. బిజినేపల్లికి చెందిన వెంకటయ్య (54) గత కొన్ని రోజులుగా ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఇదే విషయమై కుటుంబ సభ్యులు ఏదైనా పని చూసుకోవాలని సూచించారు. దీంతో మనస్తాపానికి గురైన వెంకటయ్య గురువారం ఇంట్లో నుంచి బయటికి తిరిగి రాలేదు. శుక్రవారం వినాయక వెంచర్‌లో అతని మృతదేహం స్థానికుల కంట పడింది. మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ సద్దాం హుస్సేన్ తెలిపారు. మృతుడికి భార్య శాంతమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



మద్దూరు: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మండల కేంద్రం బస్టాండ్‌లో చోటు చేసుకుంది. బంధువులు వివరాల మేరకు.. దామరగిద్ద మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన గోవిందమ్మ(40)కు ఉల్లిగుడం గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం తర్వాత ఆమె భర్త నుంచి విడిపోయి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆమెకు ఆరోగ్యం బాగలేకపోవడంతో అక్క దేవేంద్రమ్మతో కలిసి మద్దూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. చిక్సిత అనంతరం తమ గ్రామానికి వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చారు. దేవేంద్రమ్మ చెల్లెలిని బస్టాండ్‌లో ఉంచి వ్యవసాయ విత్తనాలు తీసుకరావడానికి వెళ్లింది. గోవిందమ్మ మూత్రశాలకు వెళ్లి పురుగుల మందు తాగి బస్టాండ్‌లోకి వచ్చి వాంతులు చేసుకుంది. దీన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. ఆమెను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

గుండెపోటుతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి


సురేష్(40)

రాజోళి: మండలంలోని చిన్న ధన్వాడలో ప్రభుత్వ ఇసుక రీచ్‌ల వద్ద ఇసుకను లోడ్ చేసుకునేందుకు వచ్చిన డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని తుంగభద్ర నది వద్ద ప్రభుత్వం ఇసుక రీచ్‌లను నిర్వహిస్తుంది. జిల్లాలోని ఇసుక అవసరాల కోసం 'మన ఇసుక వాహనం' అనే ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. కాగా శుక్రవారం గద్వాల సమీపంలోని జమ్మిచేడుకు చెందిన సురేష్(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా ఇసుక లోడ్ చేసుకునేందుకు చిన్న ధన్వాడకు వచ్చాడు. కాగా కూలీలను ఇసుక లోడ్ చేయాలని చెప్పి, గుండెలో నొప్పి వస్తుందని చెప్పి కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలున్నారని స్థానికులు తెలియజేశారు.

పర్యవేక్షణ ఏది..?


వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి

- విద్యాలయాల్లో కనిపించని ఫుడ్, పేరెంట్స్ కమిటీలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒకే ఒక్క ఫుడ్ ఇన్‌స్పెక్టర్
- నామమాత్రంగా తనిఖీలు, శాంపిల్స్ సేకరణ
- అమరచింత కేజీబీవీ ఘటనతో ఉలిక్కిపాటు
- ఘటనపై కలెక్టర్ అత్యవసర సమావేశం

వనపర్తి: 'మంది ఎక్కువైతే.. మజ్జిగ పలుచన' అన్న చందంగా మారింది విద్యాలయాల్లో ఆహార తనిఖీల ప్రక్రియ. గురుకులాలు, కేజీబీవీల సంఖ్య పెంచామని గొప్పగా చెప్పుకొనే పాలకులు విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు, అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం వనపర్తి జిల్లాలోని అమరచింత కేజీబీవీలో ఒకేసారి 60 మందికిపైగా విద్యార్థినులు ఆహార కల్తీతో అస్వస్థతకు గురవడం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఆయా విద్యాలయాలు, హాస్టళ్లకు సరఫరా చేస్తున్న కూరగాయలు, మాంసం, కిరాణం సామగ్రి టెండర్లను ఏళ్ల తరబడిగా ఒక్కరికే ఇవ్వడం వలన నాసిరకమైన వస్తువుల సరఫరాకు కారణమవుతోంది. ఇక కూరగాయల విషయానికి వస్తే.. అతి తక్కువ ధరకు టెండర్లు దక్కించుకునే కూరగాయల విక్రయదారులు మార్కెట్‌లో విక్రయించగా మిగిలిన ఆకు, కూరగాయలను సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో అమరచింత వంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు తప్ప.. సాధారణ సమయాల్లో తనిఖీలు నిర్వహించిన దాఖలాలు ఇటీవల కాలంలో దాదాపుగా లేవనే చెప్పాలి. ఇటీవల గోపాల్‌పేట ప్రాథమిక పాఠశాలలో పురుగులు పడిన బియ్యంతో వండిన అన్నమే విద్యార్థులకు వడ్డించారు. మీడియాలో ఈ విషయం వచ్చిన తర్వాతనే అధికారుల స్పందన ఉందంటే పర్యవేక్షణ ఏ తీరున ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫుడ్ కమిటీలెక్కడా..?

గురుకులాలు, కేజీబీవీ, పాఠశాలలు, హాస్టళ్లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ఫుడ్, పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలు నిర్దేశిత సమయాల్లో అక్కడి ఆహారం, సరఫరా చేస్తున్న పాలు, మాంసం, ఆకు, కూరగాయలు, కిరాణ సామగ్రి, తాగునీటిలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా పర్యవేక్షించాలి. అయితే కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత ఈ నిబంధనలను అధికారులు పట్టించుకోని కారణంగా కమిటీల ఏర్పాటును పక్కనపెట్టినట్లు సమాచారం.

ఐదు జిల్లాలకు ఒక్కరే..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ప్రస్తుతం ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా నీలిమ ఒక్కరే పనిచేస్తుండటం గమనార్హం. ఇది వరకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలను పర్యవేక్షించే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ కొంతకాలం క్రితం దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో నీలిమ ఒక్కరే దిక్కయ్యారు. దీంతో ఈమెనే ఐదు జిల్లాల బాధ్యతలు నిర్వర్తిస్తుండటంతో ప్రైవేటు, ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీ, హోటళ్లలో ఆహార కల్తీ పరీక్షలు నెమ్మదించాయని చెప్పవచ్చు.

నివేదిక ఇచ్చాం..

గత విద్యా సంవత్సరంలో వనపర్తి జిల్లాలోని పలు గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్లను తనిఖీ చేసి శాంపిల్స్ సేకరించి.. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం బాగోలేదని మా శాఖ కమిషనర్‌కు నివేదిక అందజేశాం. అక్కడి నుంచి ఆయా సొసైటీలకు విద్యా శాఖ ఉన్నతాధికారులకు సమాచారం పంపిస్తారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ విద్యాలయంలోనూ తనిఖీలు చేపట్టలేదు.

– నీలిమ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మహబూబ్‌నగర్

అందరూ క్షేమంగా ఉన్నారు..

అమరచింతలోని కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం తెలియగానే.. ఆస్పత్రికి తరలించేలా ఆదేశాలిచ్చాం. కొందరికి మెరుగైన వైద్యం కావాల్సి ఉందని వనపర్తి జనరల్ ఆస్పత్రికి పంపించాం. ప్రస్తుతం విద్యార్థినులు అందరూ ఆరోగ్యంగానే ఉన్నారు. అస్వస్థతకు గల కారణాలపై విచారణ చేస్తున్నాం. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాత్రి ఆహారం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

– సుబ్బలక్ష్మి, జీసీడీఓ, వనపర్తి

ఫలితాలు వస్తేనే..

అమరచింత కేజీబీవీ నుంచి వచ్చిన విద్యార్థుల్లో పూజిత, మౌనికలకు కడుపునొప్పి కొద్దిగా ఎక్కువగా వచ్చింది. కలుషితమైన నీరు, ఆహారం, కూరగాయలు, ముక్కిపోయిన పప్పు లాంటివి ఆహారంలో కలిసినా.. పురుగులు, ఇతర కీటకాలు ఆహారంలో పడినా.. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటాయి. ఈ విద్యార్థినులు ఎందుకు అస్వస్థతకు గురయ్యారో ల్యాబ్‌కు పంపించిన శాంపిల్స్ ఫలితాలు వస్తేనే ఖచ్చితంగా చెప్పగలం.

– రాజ్‌కుమార్, డీసీహెచ్ఎస్, జనరల్ ఆస్పత్రి, వనపర్తి

ద్విచక్ర వాహనాల చోరీకి యత్నం


దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న స్కూటీ


పట్టుబడిన యువకుడు

- వెంబడించి పట్టుకున్న వైనం
- వాహనం అదుపుతప్పి ఓ దొంగకు తీవ్రగాయాలు

ధరూరు: కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొందరు యువకులు రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను పట్టపగలే ఎత్తుకెళ్లారు. అప్రమత్తమైన సదరు వాహనదారులు వారిని వెంబడించి పట్టుకున్న ఘటన గద్వాల – రాయచూరు రహదారిలో కోతులగిద్ద – అల్వలపాడు గ్రామాల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. అల్వలపాడు, కోతులగిద్ద గ్రామాల రైతుల పొలాలు రోడ్డు వెంట ఉన్నాయి. రోజూలానే రైతులు రోడ్డు పక్కనే తమ ద్విచక్ర వాహనాలను నిలిపి పత్తి చేల్లో పనులు చేసుకునేందుకు వెళ్లారు. అయితే, వీరిని ఎప్పటి నుంచో పసిగట్టిన కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన యువకులు మణికంఠ, సుదీప్, నరేష్ ముగ్గురు ఒకే వాహనంపై అక్కడికి వచ్చారు. తమ్మప్ప, రవికి చెందిన రెండు వాహనాలను ఎలాగోలా స్టార్ట్ చేసి అక్కడి నుంచి పరారయ్యారు. వెంటనే పసిగట్టిన రైతులు గట్టిగా కేకలు వేయడంతో అప్రమత్తమైన పరిసర ప్రాంతాల రైతులు ఆ ముగ్గురిని వెంబడించారు. అల్వలపాడు శివారులో ఇద్దరిని, నందిన్నె వద్ద మరొకరిని ఎట్టకేలకు పట్టుకొని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వీరంతా రాయచూరుకు చెందిన యువకులుగా పోలీసులు గుర్తించారు. జూరాల ప్రాజెక్టు వద్ద చేప వంటకాలు తిని, మద్యం సేవించి తిరుగు ప్రయాణంలో ఈ చోరీకి పాల్పడినట్లు తెలిసింది. ముగ్గురు దొంగల్లో ఒకరు పారిపోయే క్రమంలో వాహనం అదుపుతప్పడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రెండు రోజుల్లో ఆర్ఐలకు స్థానచలనం?

మహబూబ్‌నగర్ క్రైం: ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ఉమ్మడి జిల్లాలోని పోలీస్‌శాఖలో సమూలంగా మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు దఫాలుగా ఎస్ఐలు, సీఐలకు స్థానచలనం కల్పించారు. ఎస్ఐలకు సంబంధించిన బదిలీలు అయితే దాదాపు పూర్తి అయినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో కొన్ని స్థానాల్లో సీఐలు బదిలీ చేయాల్సి ఉంది. దీంతో పాటు మరో రెండు రోజుల వ్యవధిలో మల్టీజోన్-2 కింద ఉన్న ఆర్ఐలను బదిలీ కానున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 15 మంది వరకు ఆర్ఐలు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఆయా జిల్లా హెడ్‌క్వార్టర్స్ నుంచి స్థానచలనం కలగనుంది.

గోవా మద్యం పట్టివేత

కృష్ణా: మండల సరిహద్దులోని ఎక్సైజ్ చెక్‌పోస్టులో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా గోవా నుంచి తరలిస్తున్న 5 బాటిళ్ల మద్యం పట్టుకున్నామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మేరకు మద్యాన్ని తీసుకొస్తున్న వాహనంతోపాటు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామని వారు పేర్కొన్నారు.

తగ్గిన నీటిమట్టం

మదనాపురం : మండల పరిధిలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతోంది. జూరాల ఎడమ, సమాంతర, ఎన్టీఆర్ కాలువల ద్వారా వచ్చే నీటిని నిలిపి, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రజాహిత పాదయాత్ర


పాదయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, తదితరులు

- 9న ఫతేపూర్ మైసమ్మ ఆలయం నుంచి ప్రారంభం
- గడప గడపకూ కాంగ్రెస్ మేనిఫెస్టోను తీసుకెళ్తాం
- టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ప్రజా సమస్యలను గుర్తించడంతోపాటు ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు ప్రజాహిత పాదయాత్రను ఈనెల 9 నుంచి ప్రారంభిస్తున్నట్లు టీపీసీసీ కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జడ్చర్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవాబ్‌పేట మండలం ఫతేపూర్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాదయాత్ర ప్రారంభం అవుతుందని ,గ్రామ గ్రామానికి తన పాదయాత్ర సాగుతుందని తెలిపారు. రెండు నెలల పాటు సాగే పాదయాత్ర నవాబ్‌పేట, రాజాపూర్, బాలానగర్, జడ్చర్ల, మిడ్జిల్ మండలాల గుండా కొనసాగి ఊర్కొండ మండలంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ముగుస్తుందన్నారు. ఇంటింటికి వెళ్లి పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న మేనిఫెస్టోను తెలియజేస్తామన్నారు. రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, ఫించన్ రూ.4వేలకు పెంపుతోపాటు రైతుల రుణాలు రూ.2లక్షల మాఫీ, రైతుబంధు ఏటా ఎకరానికి రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు వంటి అనేక పథకాలను తెలియజేస్తామన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలు వివరిస్తాం

జడ్చర్ల నియోజకవర్గంలో భూకబ్జాలు పెరిగిపోయావని, అధికార పార్టీ నాయకులు అక్రమాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాదయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్యరావుఠాక్రే, తదితర ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ప్రజాహిత పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఈసందర్భంగా ఆయన విడుదల చేశారు.

బాధితులకు అండగా ఉంటాం..

తిరుమల వెంచర్‌లో తాము కొనుగోలు చేసిన ప్లాట్లను ఆక్రమించి కొత్తగా వెంచర్‌ను ఏర్పాటు చేసి చ.గ. రూ.16,500కు విక్రయిస్తున్నారని, తమకు ఎలాగైన న్యాయం చేయాలని కోరుతూ బాధితులు అనిరుధ్‌రెడ్డిని కలిసి తమగోడును వెళ్లబోసుకున్నారు. సంబంధిత అధికారులకు,పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరు పట్టించుకోవడం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆక్రమణలపై చర్యలు చేపట్టి న్యాయం చేస్తామని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నిత్యానందం,వార్డు కౌన్సిలర్ విజయ్,నాయకులు అయ్యన్న,సర్ఫరాజ్,కృష్ణయ్య,అనిత,తదితరులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం పరిశీలిస్తున్న డీటీ వేణు

అమరచింత: పట్టణం నుంచి అక్రమంగా మదనాపురానికి తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారుజామున సీఐ రత్నం ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుబడిన రేషన్‌బియ్యంతో ఉన్న బొలెరో వాహనాన్ని అమరచింత పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ శివనాగేశ్వర నాయుడు మాట్లాడారు. అమరచింత పట్టణానికి చెందిన ప్రవీణ్ కొంత కాలంగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాడనే సమాచారంతో వాహనాన్ని పట్టుకున్నామన్నారు. విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వేణు పట్టుబడిన బియ్యాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ప్రవీణ్‌తో పాటు డ్రైవర్ మౌళాలిపై కేసు నమోదు చేసి, పట్టుబడిన బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాంకు తరలించామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కల్వకుర్తిరూరల్ : పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో శుక్రవారం సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీ నిర్వహించి రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నారు. అనంతరం ఏఎస్‌ఓ స్వామి కుమార్ విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి బాలాజీ రైస్ మిల్లు నుంచి 290 బ్యాగులతో సివిల్ సప్లయ్ గోదాముకు వెలుతున్నదని చెప్పారు. అందులో 50 బ్యాగులు కల్వకుర్తి మండలం తర్నికల్ సమీపంలోని ఎస్ఆర్‌వీ రైస్ మిల్లు నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో డీసీఎంలో బ్యాగులను పరిశీలించామన్నారు. శనివారం, ఆదివారం సెలవు కావడంతో సోమవారం విచారణ చేసి, బియ్యాన్ని ల్యాబ్ పరీక్షకు పంపిస్తామన్నారు. అనంతరం డీసీఎంను కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీడీలు నర్సింగరాజు, రవికుమార్ ఉన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జడ్చర్ల: ఫ్లెక్సీల హోరు–ప్రజల బేజారు శీర్షికతో శుక్రవారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తా కథనం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలో విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న ఫ్లెక్సీలపై సోషల్ మీడియాలో సాక్షి కథనం చక్కర్లు కొట్టడంతో సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించారు. మహనీయుల విగ్రహాల చుట్టూ కట్టిన ఫ్లెక్సీలను తొలగించారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెట్టిన వారికి జరిమానా విధించాలని స్థానికులు డిమాండ్ చేశారు. అనుమతులు లేని ఫ్లెక్సీల వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ తెలిపారు.

పాలమూరుకు భారీ విజయం


జిల్లా క్రికెట్‌జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా తదితరులు

- టూడే లీగ్ మ్యాచ్‌లో బాలాజీ కోల్ట్స్ ఓటమి
- 286 పరుగుల తేడాతో గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ బి–డివిజన్ టూడే లీగ్ ఛాంపియన్‌షిప్ లీగ్ మ్యాచ్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. 286 పరుగుల తేడాతో బాలాజీ కోల్ట్స్ జట్టును మట్టికరిపించింది. తొలిరోజు జిల్లా జట్టు 5 వికెట్లకు 457 పరుగులు చేసింది. శుక్రవారం రెండో రోజు బాలాజీ కోల్ట్స్ బ్యాటింగ్‌కు దిగగా జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లు కోల్పోయింది. 64.3 ఓవర్లలో 171 పరుగులకే ఆలౌట్ అయింది.

ఎండీసీఏ అభినందనలు...

హెచ్‌సీఏ టూడేలీగ్ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించడంతో మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో టూడేలీగ్‌లో మెరుగైన ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

చిరుత సంచారంపై అధికారుల పరిశీలన


చిరుత జాడలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని సంకలమద్ది శివారులోని పెద్దగుట్ట వద్ద శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారులు చిరుత జాడ కోసం పరిశీలన చేపట్టారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్ శశికళలు పెద్దగుట్ట, ముత్యం గుండు వద్ద చిరుత జాడల కోసం వెతికారు. అయితే ఆయా చోట్ల చిరుత జాడలు కనిపించలేదని సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. జూన్ 27న ఇవే ప్రదేశాల్లో చిరుత సంచరిస్తోందన్న సమాచారంతో అదే రోజు పరిశీలన చేపట్టామని తెలిపారు. చిరుత సంచారం చేసే చోట గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలను ఉంచవద్దని రైతులకు సూచించినట్లు తెలిపారు. అయినా కాపరులు గొర్రెలను గుట్ట వద్దకు తీసుకెళ్లారని, కొన్నాళ్ల పాటు గుట్ట పరిసరాలకు జీవాలను తీసుకెళ్లవద్దని కాపరులు, రైతులకు తాజాగా సూచనలు చేశారు. చిరుతను బంధించే అవకాశం లేదని అధికారులు తెలిపారు. మనుషులపై అవి దాడి చేసే అవకాశం కూడా లేదని చెప్పారు. చిరుతలు ఆహారం అందకపోతే ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోతాయని, ఇందు కోసం గుట్ట పరిసరాల్లో ఎలాంటి జీవాలను ఉంచకుండా జాగ్రత్త వహించాలని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వర్షాలు లేక పొలాలు ఎండిపోయి ఉండటంతో చిరుత జాడలు కనిపించడం లేదని రైతులు అంటున్నారు. గురువారం గొర్రెల మందపై చిరుత దాడి చేయడాన్ని దగ్గరుండి చూశామని కాపరులు చెబుతున్నా అధికారులు చిరుత రాలేదని అంటున్నారని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించే ప్రయత్నాలు చేయడం లేదని కాపరులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

పీయూలో సాఫ్ట్‌బాల్ క్రీడను ప్రవేశపెట్టాలి


పీయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు యూనివర్సిటీలో సాఫ్ట్‌బాల్ క్రీడను ప్రవేశపెట్టాలని జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం సభ్యులు శుక్రవారం పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. సాఫ్ట్‌బాల్ క్రీడను పెడితే ఎంతో మంది క్రీడాకారులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో వీసీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం సభ్యులు సాదిక్‌అలీ, నాగరాజు, రాఘవేందర్, జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి రాంచందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెల్దండ: మండల కేంద్ర సమీపంలో శుక్రవారం రాత్రి ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా.. ఉప్పునుంతలకు చెందిన ఉప్పునుంత విష్ణుచారి(38) హైదరాబాద్‌లో తన కుమారుడిని హాస్టల్‌లో చేర్పించి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో వెల్దండ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న విష్ణుచారి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విష్ణుచారికి భార్య లావణ్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.